



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గుంటూరు పల్నాడు

ఆదివారం 03 ఆగస్టు 2025 - పేజీలు 8



# దేశ భవిష్యత్తు నిర్ణయించే నిర్మాతలు యువతే..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్




## వేడుకగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం

- 2122 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం 60 మంది విద్యార్థులకు బంగారు పతకాలు
- ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లు
- ఏఐ టూల్స్‌పై విద్యార్థులు పట్టు సాధించాలి
- సామరస్యాన్ని, శాంతిని పెంపొందించాలి : విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య
- ఆవిష్కరణలే భారతదేశ వ్యూహం కావాలి : విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు

<u>గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో</u>

**యు**వతే భారతావని నిర్మాణానికి ఆధార స్తంభాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 13వ స్నాతకోత్సవాన్ని శనివారం వర్సిటీ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ విజ్ఞాన్‌లో విద్యార్థులు ఇంజినీరింగ్‌తో పాటు హ్యూమానిటీస్, వ్యవసాయంతో పాటు ఏఐ, డిజైన్‌తో పాటు చట్టాన్ని కలిపి చదువుతున్నారు. ఇక్కడ గ్రాడ్యుయేట్లను తయారు చేయడం కాదు  భవిష్యత్తు నిర్మాణ శిల్పులను తయారు చేయడమే విజ్ఞాన్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశ నిర్మాణంలో విశ్వవిద్యాలయాలకు కీలక పాత్ర ఉందన్నారు. ఇవి కేవలం విద్యా కేంద్రాలు కాదని, ఇవి పరిశోధన, ఆవిష్కరణ, స్టార్టప్‌లు మరియు సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా మారాయన్నారు.

**మిగతా 3లో**

## మొండిగేట్ వద్ద అదనపు వెంట్ వే నిర్మించండి

- మురుగు ముంపును నివారించండి
- ట్రాఫిక్ సమస్య నివారణకు సహకరించండి
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, మేజర్ న్యూస్ :** తెనాలి-గుంటూరు రైల్వే సెక్షన్‌లోని బ్రిడ్జి నంబర్ 7 వద్ద అదనపు వెంట్ వే నిర్మాణంతోపాటు నెహ్రూనగర్ రైల్వే గేటు సామర్థ్యం పెంచాలని, తద్వారా వరద ముంపు, ట్రాఫిక్ సమస్యలను నివారించాలని డివిజనల్ రైల్వే మేనేజర్ ను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానితో కలిసి డీఆర్ఎంకు వినతిపత్రం అందించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడు మురుగునీటి కాలువలు ఉన్నాయని, వీటిలో రాజీవ్ గృహకల్ప కాలువ ప్రధానమైనదని తెలిపారు.  నగరంలోని మురుగు, తుఫాను నీరు దాదాపు 30 శాతం ఈ కాలువ ద్వారానే బయటకు వెళుతుందని వివరించారు. ప్రస్తుతం ఈ ప్రధాన కాలువ

**మిగతా 3లో..**



## రైతులకు ఆర్థిక స్థిరత్వం కల్పిస్తున్న పీఎం కిసాన్ పథకం





- కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని వెల్లడి
- ఆచార్య రంగా యూనివర్సిటీలో పిఎం కిసాన్ సమ్మన్ కార్యక్రమం నిర్వహణ
- రైతుల సంక్షేమంలో డ్రోన్లు కీలకంగా మారనున్నాయి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** పీఎం కిసాన్ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులకు ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని , వ్యవసాయం లాభదాయకంగా మారేందుకు ఇది ఒక కీలక పథకమని కేంద్ర గ్రామీణాభివృద్ధి , కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ పేర్కొన్నారు. శనివారం తాడికొండ మండలం లాం లోని ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విద్యాలయం  కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన " అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమంలో  కేంద్ర గ్రామీణాభివృద్ధి ,కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి  డా. పెమ్మసాని చంద్ర శేఖర్ ,

**మిగతా 3లో..**

## తల్లిపాలతోనే ఆరోగ్యకరమైన సమాజం

**– మన పూర్వీకుల పద్ధతులే అవలంబించాలి**
**– 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్**




**గుంటూరు మేజర్ న్యూస్ :** తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు ఒకటి నుంచి ఏడో తారీఖు వరకు తల్లిపాల ప్రాముఖ్యతను గురించి తెలియజేయడానికి ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక కార్యచరణను ముందుకు తీసుకువెళ్లడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్ పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో అద్భుతమైన విజయాల సాధిస్తున్నప్పటికీ మన సంస్కృతి సాంప్రదాయాలతో పాటు మన పూర్వీకులు చెప్పిన విధంగా తల్లిపాలతోనే కన్నబిడ్డల కడుపు నింపాలని తద్వారాన్ని ఆరోగ్యవంతులైన బిడ్డలను సమాజానికి అందించిన వారమవుతామనే సిద్ధాంతాన్ని ఎన్నటికీ మరవకూడద న్నారు. ఇప్పుడున్నటువంటి జనరేషన్లో పుట్టిన బిడ్డకు తల్లిపాలు తొలి నుండి రెండు సంవత్సరాల వరకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా పుట్టినప్పటినుంచి ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా ఇప్పుడున్నటువంటి పరిస్థితులను బట్టి ఇద్దరు సంపాదిస్తేనే కుటుంబం గడుస్తుందనే ఉద్దేశంతో ఉద్యోగాల మీద, సంపాదన మీద పడిపోయి పిల్లలకు ఆరోగ్యకరమైన తల్లిపాలను తల్లి ప్రేమను దూరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు చేస్తూ బిజీ అయిపోతున్న కొంత సమాజం తల్లిపాలకు బదులుగా వారి బిడ్డలకు డబ్బా పాలు అందిస్తూ అనారోగ్యాలు కొన్ని తెచ్చు కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని మనకు మనమే నిర్మించుకోవాల్సి ఉందని అందుకోసమే తల్లిపాల వారోత్సవాల గురించి 29వ వార్డులో రామిరెడ్డి నగర్ లో కార్పొరేటర్ షేక్ రోషన్ అలాగే సూపర్వైజర్ జె లక్ష్మి, అలాగే అంగన్వాడీ టీచర్స్, స్టూడెంట్స్ తో కలిసి ప్రచార కార్యక్రమం నిర్వహించినట్లుగా వారు తెలిపారు.

## విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ సంతకసేకరణ



**తెనాలి, మేజర్ న్యూస్ :** విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొల్లిపర మండల పరిధిలోని శివలూరు, దావులూరు గ్రామాల్లో మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని కోరుతూ సంతక సేకరణ నిర్వహించారు. ఈ సంవత్సర కాలంలో నాలుగు రకాల సర్దుబాటు చార్జీలు పేరుతో ప్రజల మీద రూ. 15,485 కోట్ల అదనంగా భారం వేయటం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన అనంతరం షాపులు చిన్న పరిశ్రమలు రెండు మూడు రెట్లు చార్జీలు పెరగటం భారంగా ఉందని ఆయన తెలిపారు. పాత మీటర్ ని కొనసాగించాలని పాత రీడింగ్ పద్ధతిని అమలు చేయాలని ఇండ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని షాపులు పెట్టిన మీటర్లు తొలగించాలని సంతక సేకరణ చేయించారు. ఈ కార్యక్రమంలో భీమిరెడ్డి శివారెడ్డి, జొన్నల ప్రకాష్ రెడ్డి, కొల్లి వెంకటరెడ్డి, బొంతు శంకర్ రెడ్డి, అవుతు మోహన్ రెడ్డి, జిలుగు ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

## నితిన్ గడ్కరి ఘన స్వాగతం



**గుంటూరు మేజర్ న్యూస్ :**

తాడేపల్లిలో సి. కే కన్వెన్షన్ నందు గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ప్రతిపాదనల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జాతీయ రహదారుల శంకుస్థాపన మరియు రహదారులను జాతికే అంకితం చేయడానికి కేంద్ర రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి విచ్చేశారు. వారికి ఘన స్వాగతం పలకడానికి ప్రత్తిపాడు నియోజవర్గం శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు నేతృత్వంలో పత్తిపాడు నియోజకవర్గ నలుమూలల నుండి భారీ స్థాయిలో కార్లు, బస్సులు, మోటారు బైకులతో భారీ ర్యాలీగా తరలిరావడం జరిగినది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్కింగ్ లేకుండా హొటల్స్, రెస్టారెంట్లు, టీ, టిఫిన్ స్టాల్స్ నిర్వహిస్తే కఠిన చర్యలు

**– భాగ్యనగర్, తుఫాన్ నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన**
**– ట్రాఫిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు జీఎంసి కృషి**
**– నగర కమిషనర్ శ్రీనివాసులు**




**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పార్కింగ్ లేకుండా ట్రాఫిక్ కి అంతరాయం కల్గించే హొటల్స్, రెస్టారెంట్లు, టీ, టిఫిన్ స్టాల్స్ పై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం శ్రీకృష్ణదేవరాయ నగర్, భాగ్యనగర్, తుఫాన్ నగర్, పెద్ద పలకలూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్యం, ఖాళీ స్థలాల్లో బోర్డ్ లు, ఇంటి పన్నులు అంశాలపై అధికారులకు తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేసి, గుజ్జనగుండ్ల సెంటర్ లో రోడ్ నే పార్కింగ్ ప్రాంతంగా వినియోగిస్తున్న రవి క్రేజీ ఫుడ్స్ ని సీజ్ చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో శంకర్ విలాస్ వంతెన నిర్మాణ పనుల వలన ట్రాఫిక్ సమస్య రాకుండా ఇప్పటికే రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు చేపట్టామన్నారు. గుజ్జనగుండ్ల సెంటర్ లోని రవి క్రేజీ ఫుడ్స్ నిర్వాహకులకు గతంలోనే పలుమార్లు ట్రాఫిక్ సమస్య లేకుండా హొటల్ కి వచ్చే వారి వాహనాలు పెట్టుకోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించామని, అయినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ట్రాఫిక్ సమస్యల వలన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కల్గించే సదరు హొటల్ ని తక్షణం సీజ్ చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించగా, వారు సీజ్ చేశారు. అనంతరం స్తంభాల గరువు, భాగ్య నగర్, తుఫాన్ నగర్ లలో పర్యటించి, ఆయా ప్రాంతాల్లో ఇళ్ల యజమానులు ఆస్తి, నీటి పన్ను చెల్లించడం లేదని గుర్తించి, జీఎంసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యం కృషి చేస్తున్నందున పన్నులు సకాలంలో చెల్లించాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పెద్దపలకలూరులో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల్లో వర్షం, మురుగునీరు నిలిచి దోమలతో ఇబ్బంది పడుతున్నామని ప్రజల ఫిర్యాదు మేరకు ఆయా స్థల యజమానులకు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలని, స్పందించని వారి స్థలాల్లో జీఎంసి బోర్డ్ లను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏసిపి రెహ్మాన్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో విజయవంతంగా క్లిష్టతరమైన గుండె శస్త్ర చికిత్స

**– గుండెకు సంబంధించి ఎంత క్లిష్టమైన సమస్యలైనా మెరుగైన వైద్యంతో నయం చేస్తాం**
**– డాక్టర్ యోగి చాగంటి**




**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :**

తల్లి గర్భంలో గుండె తయారీ సమయంలో గుండె అనేది 4 గదులుగా ఏర్పడుతుందని, దాని వలన ఆక్సిజన్ పుష్కలంగా గుండెలో నిండి మిగిలిన శరీర భాగాలకు రక్తం అవసరమైన మేరకు అందుతుందని హార్ట్ సర్జన్ విభాగంలో ఆల్ ఇండియా గోల్డ్ మెడల్ సాధించిన డాక్టర్ యోగి చాగంటి పేర్కొన్నారు. పుట్టుకతో వచ్చిన గుండె జబ్బుతో తీవ్రంగా బాధపడుతున్న 37 ఏళ్ల రుద్రపాటి వాణి కి గుంటూరులోని కొత్తపేట ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో క్లిష్టతరమైన అరుదైన ఆపరేషన్ చేశామని వారు వెల్లడించారు. 5,00,000 రూపాయల విలువైన ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగానే విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. పెదకాకాని మండలం తంగేళ్లమూడికి చెందిన వాణి అనే మహిళకు నాలుగు గదులు లేకుండా ఓకే గదిగా గుండె తయారి అయ్యిందని ఈ ప్రక్రియ ప్రాణాంతకమైనదని పేర్కొన్నారు. ఇలాగే గుండె పని చేస్తే( కంప్లీట్ ఏట్రియో వెంట్రిక్యులర్ కెనాల్ డిఫెక్ట్ )ఎడమవైపు ఉన్న మంచి రక్తం కుడివైపు ఉన్న చెడు రక్తంతో కలిసి ఊపిరితిత్తులకు ఎక్కువ మోతాదులో వెళుతుండడంతో శరీరానికి రక్తం సరఫరా తక్కువగా జరిగి పేషెంట్‌కు ఆయాసం, అలసట వస్తుందన్నారు. ఇలాంటి గుండెజబ్బుకి సర్జరీ చేయని పక్షంలో ఎక్కువ కాలం జీవించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఐదేళ్లలోపు సర్జరీ చేస్తే సక్సెస్ రేట్ ఎక్కువగా ఉంటుందని డాక్టర్ యోగి చాగంటి వెల్లడించారు. ఈ ఆపరేషన్ చేసిన వైద్య బృందంలో డాక్టర్ రామరాజు, డాక్టర్ శిరీష్ (అ–నస్థీషియా), డాక్టర్ నిఖిల్ ప్రవీణ్ (కార్డియాలజిస్ట్),డాక్టర్ మాధవి ( క్రిటికల్ కేర్ ), డాక్టర్ కాశిరాం ( పల్మనాలజిస్ట్ ) ఉన్నారు. జూన్ నెల 6 న జాయిన్ అయ్యారని, నెలరోజుల పాటు వైద్య పరీక్షలు నిర్వహించి అబ్జర్వేషన్ తర్వాత జులై ఆరవ తేదీన విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేశామని ఇలా చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సర్జరీ జరిగిన ఐదవ రోజు పేషెంట్ ను డిశ్చార్జి చేశామని తెలిపారు. ఆదిత్య హాస్పిటల్లో ఇప్పటివరకు 80 కి పైగా గుండె ఆపరేషన్లు 100కు 100 శాతం సక్సెస్ రేటుతో విజయవంతంగా పూర్తి చేసినట్లు వైద్యులు వెల్లడించారు. గుండెకు సంబంధించి ఎంత క్లిష్టమైన సమస్యలైనా పరిష్కారానికి మెరుగైన వైద్య సహాయం అందించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటామని ఈ సందర్భంగా వారు జిల్లా పరిసర ప్రాంతాల ప్రజలకు విన్నవించారు.

## పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కన్నా




**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** అన్నదాతల కళ్లలో ఆనందం నింపుతూ, రైతుల ఇళ్లల్లో పండుగ వాతావరణం తెస్తూ అన్నదాత సుఖీభవ పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించిన సందర్భంగా శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో మాజీ మంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నదాత సుఖీభవ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన సత్తెనపల్లి పట్టణ మార్కెట్ యార్డ్ నందు నల్లబెర్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నకరికల్లు మండలానికి చెందిన శ్రీ గోపాలకృష్ణ రైతు మిత్ర సంఘం వారికి సబ్సిడీపై డ్రోన్ ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈరోజు ప్రారంభించడం జరిగిందన్నారు. కేంద్రం ఇచ్చే 6 వేల రూపాయలతో కలుపుకుని ఏడాదికి 20 వేల రూపాయలు మూడు విడతల్లో రైతులకు ఇస్తామని మనం ఎన్నికల ముందు చెప్పామని, చెప్పిన మాట ప్రకారం మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం 5 వేలు కేంద్ర ప్రభుత్వం 2 వేలు కలుపుకొని 7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. 90% శాతం సబ్సిడీతో రైతులకు డ్రిప్ అందిస్తున్నామని, రైతు రథాలు, యంత్ర పరికరాలు సబ్సిడీలో ఇచ్చాము కానీ గత ప్రభుత్వంలో అన్నింటినీ రద్దు చేసిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం 12,500 ఇస్తామని చెప్పి కేవలం 7,500 మాత్రమే ఇచ్చిందని తెలిపారు.

ప్రజలకు కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందని, తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో పిల్లలు ఎంతమంది ఉన్నా 15 వేల రూపాయలు చొప్పున వేసామని, ఈ నెలలో సూపర్ సిక్స్ లో మరో రెండు హామీలు అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్వాతంత్ర దినోత్సవం రోజున మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. అన్నదాత సుఖీభవ వల్ల రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. రూ. 2,342. 92 కోట్లు రైతుల ఖాతాలో నేరుగా ప్రభుత్వం జమ చేసినట్లు పేర్కొన్నారు. పీఎం కిసాన్ పథకంలో ఏడాదికి కేంద్రం రూ. 6 వేల సాయం, అన్నదాత సుఖీభవ కింద మరో రూ. 14 వేలు కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ. 20 వేలు జమ చేస్తున్నట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు తొలివిడతలో రూ. 7 వేలు జమ చేసునట్లు వివరించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ యార్డ్ చైర్మన్ కోమటినేని శోభారాణి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, నియోజకవర్గ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, నాగోతు శౌరయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, నాయకులు చౌటా శ్రీనివాసరావు, అంచుల నరసింహారావు, మార్కెట్ యార్డ్ అధికారులు, సిబ్బంది, యార్డ్ డైరెక్టర్లు, వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు నిర్ణయించే నిర్మాతలు యువతే




**మొదటిపేజి తరువాయి**

ఇంజినీరింగ్ వల్ల వ్యవసాయ రంగానికి డ్రోన్లు, సెన్సర్లు, డేటా ఆధారిత ఫార్మింగ్ సాధ్యమైందన్నారు. ఆరోగ్యరంగంలో డయగ్నొస్టిక్స్, డ్రగ్ డెలివరీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. పాలసీ, విద్య, మానసిక శాస్త్రంలో డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా స్థిరమైన పరిష్కారాలు సాధ్యమవుతున్నాయన్నారు. ఇంజినీరింగ్ ఒక శాస్త్ర విభాగం కాదు మార్పు యొక్క భాషగా మారిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగా కాకుండా, ఒక టెక్ నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తోందన్నారు. స్మార్ట్ శ్రేణి మౌలిక వసతులు, సుస్థిరత, డిజిటల్ పాలన, ప్రజా కేంద్ర సేవలతో ఆవిష్కరణ కేంద్రంగా మారుతోందన్నారు. అదే సమయంలో, 'క్వాంటం వ్యాలీ' అనే ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రపంచ క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా మారాలన్న దిశగా సాగుతోందన్నారు. ఇది భారత జాతీయ క్వాంటం మిషన్ (ఎన్‌క్యూఎం)కి అనుగుణంగా అమలవుతుందన్నారు. అమరావతిని సిలికాన్ వ్యాలీ తరహాలో అభివృద్ధి చేసే దిశగా ఈ ప్రణాళికలు ఉన్నాయన్నారు. ఈ కొత్త అమరావతిని నిర్మించేవారు ఎవరు? కేవలం అధికారులు కాదు, కేవలం ఇంజినీర్లు కాదు మీలాంటి విద్యార్థులు, యువతే ఆ నిర్మాణానికి ఆధార స్తంభాలని వెల్లడించారు. నేడు డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులందరూ బాధ్యతలతో నిండిన వారిగా ముందుకు వెళ్లాలన్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయం మీకు ఇచ్చిన విజన్, విలువలు, నీతి, సహనాన్ని ప్రపంచానికి చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వాస్తవానికి విజయం అంటే ఏమిటి? "విజయం అనేది పదం కాదు %-% అది ప్రయాణం. అది మన ప్రయత్నాల్లో, మన కృషిలో ఉంది. విజయం సంపదలో కాదు, ప్రజ్ఞలో ఉంది. విజయం పేరు కోసం కాదు, పరమార్థం కోసం ఉండాలి" అని తెలిపారు. ఎవరైతే తమ స్వంత లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుంటారో వారే నిజంగా విజేతలుగా నిలుస్తారన్నారు. ఇతరులతో మిమ్మల్ని పోల్చుకోకండి. ప్రతి ఒక్కరి ప్రయాణం ప్రత్యేకం. మీరు మీ గతాన్ని చూడండి మీ లక్ష్యానికి ఎంత చేరువయ్యారో చూడండి. అదే నిజమైన కొలమానమని వెల్లడించారు. అత్యున్నత విజయాలు, ఎన్నో అపజయాల నుంచే వస్తాయని, ఉదాహరణకు, అబ్రహాం లింకన్ జీవితాన్ని పరిశీలిస్తే.. రాష్ట్ర శాసనసభకు ఓడిపోయారు, హౌస్ స్పీకర్ పదవికి ఓడిపోయారు, కాంగ్రెస్ నామినేషన్ కోల్పోయారు, అమెరికా సెనేట్‌కు రెండు సార్లు ఓడిపోయారు. కానీ ఆయన ఆశలను వదలలేదు. ఆత్మవిశ్వాసం సాక్షిగా ఆయన అమెరికా ప్రెసిడెంట్‌గా ఎదిగారు తెలియజేసారు. మన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జే. అబ్దుల్ కలామ్ చెప్పిన మాటలు "ఫెయిల్ అంటే ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్. ఎండ్ అంట్ ఎఫర్ట్ నెవర్ డైస్. నో అంటే నెక్స్ట్ ఆపర్చునిటీ" అని విద్యార్థులతో పంచుకున్నారు. విజయం అనేది ఒక గమ్యం కాదు.అది ప్రయాణం. ఆ ప్రయాణం మొదలెట్టడమే మొదటి విజయం. ప్రతిజ్ఞ, పట్టుదల, కృషి ఉంటే ప్రతి ఒక్కరూ విజేతలవ్వగలరని తెలియజేసారు.

**ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు..** 13వ స్నాతకోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో కృషి చేసిన హైదరాబాద్‌లోని ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, హైదరాబాద్‌లోని జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్, లిటిల్ మ్యాజిసియన్స్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమండూరి రామాచారిలకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేసింది.

**2122 మందికి డిగ్రీలు :** 13వ స్నాతకోత్సవం సందర్భంగా మొత్తం 2122 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. వీటితోపాటు 60 ( అకడమిక్ గోల్డ్ మెడల్స్26, బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డులు23, చైర్మన్ గోల్డ్ మెడల్ -1, లావు వెంకటేశ్వర్లు, బండారుపల్లి వెంకటేశ్వరరావు, ఆలపాటి రవీంద్రనాథ్ ఎండోమెంట్ గోల్డ్ మెడల్స్ -3, స్పెషల్ అప్రిసియేషన్ అవార్డు - 1, బెస్ట్ లీడర్ -1, బెస్ట్ ఎన్‌సీసీ క్యాడెట్-1, బెస్ట్ ఎన్ఎస్-ఎస్ వాలంటీర్-1, ఎగ్జంప్లరీ స్టూడెంట్ అవార్డు-1, బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్ ఫ్రమ్ హాస్టల్-2 విద్యార్థులకు బంగారు పతకాలను అందజేసామని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏఐ టూల్స్‌పై పట్టు సాధించాలని హైదరాబాద్‌లోని ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు చెప్పారు. విద్య, ఉద్యోగం, ఆట, పాట...ఎందులో టాపర్‌గా నిలవాలన్నా మంచి అలవాట్లు, చక్కని ప్రణాళిక ఎంతో కీలకమన్నారు. విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ఒక్కటే విజయాన్ని అందించలేదు. ముఖ్యమైన జీవన నైపుణ్యాలను అలవర్చుకున్నవారే జీవితంలో రాణించగలరు. మేటి అకడమిక్ పరిజ్ఞానంతో పాటు విశ్వనైపుణ్యాలను సొంతం చేసుకున్నవారు వృత్తి జీవితంలోకి ధైర్యంగా అడుగుపెట్టి రాణించగలరు. జిజ్ఞాస, సమర్థ సమయ పాలన, బుద్ధి స్థిరత్వం, వేగంగా సంగ్రహించుకోగలగడం... ఇలా ఎన్నో అంశాలు విజయాన్ని ప్రభావితం చేస్తాయి " అని పేర్కొన్నారు. హెదరాబాద్‌లోని జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి మాట్లాడుతూ సాంకేతిక పురోగతి నుంచి సామాజిక అసమానత వంటి అనేక గణనీయమైన సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందని హెదరాబాద్‌లోని జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి పేర్కొన్నారు. తన సృతజనాత్మకతకు దక్కిన గౌరవం ఇదని మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్, లిటిల్ మ్యాజిసియన్స్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమండూరి రామాచారి అన్నారు. విద్యార్థులు సామరస్యాన్ని, శాంతిని పెంపొందించాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు.

**ఆవిష్కరణలే భారతదేశ వ్యూహం కావాలి : లావు శ్రీకృష్ణదేవరాయలు**
ఆవిష్కరణలే భారతదేశ అభివృద్ధి వ్యూహం కావాలని విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మేకిన్ ఇండియా మాత్రమే కాదు ఇన్వెంట్ ఇన్ ఇండియా, డిజైన్ ఇన్ ఇండియా, లీడ్ ఫ్రమ్ ఇండియా కూడా కావాలని పిలుపునిచ్చారు. భారత భవిష్యత్తు అనేది.. విభిన్న రంగాలలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై, విజ్ఞానాన్ని వ్యవస్థగా మారుస్తూ, ఆలోచనలను ప్రభావంగా మలచడంపై ఆధారపడి ఉందన్నారు. దేశంలోని యువతకు ఆలోచన ఉంది, పరిశోధన ఉంది, పట్టుదల కూడా ఉందన్నారు. అయితే, ఇప్పుడు మనకు అవసరమైనవి ఏంటంటే... రిస్క్ తీసుకునే ధైర్యాన్ని ప్రోత్సహించే వాతావరణం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లను ప్రోత్సహించే సంస్కృతి, ఆలోచనలను ఉత్పత్తులుగా మార్చే వ్యవస్థ, ఉత్పత్తులను ప్రపంచ స్థాయి పరిష్కారాలుగా అభివృద్ధి చేసే దృష్టికోణం కావాలన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆయా విభాగాల్లో సత్తా చాటిన 60 విద్యార్థులకు బంగారు పతకాలు అందజేసింది. వివిధ డిపార్ట్‌మెం ట్‌ల నుంచి అకడమిక్ గోల్డ్ మెడల్ స్టూడెంట్స్ కు విజ్ఞాన్ అందజేసింది.

**అంబరాన్నింటిన సంబరం..** డిగ్రీలు చేతబట్టుకున్న వేళ విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. కేరింతలతో వర్సిటీ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. నాలుగేళ్ల తమ అనుభవాలను విద్యార్థులు ఒకరికొకరు పంచుకున్నారు. తరగతి గదుల్లో గడిపిన క్షణాలను నెమరువేసుకున్నారు. విశ్వవిద్యాలయంతో తాము పెంచుకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సరదగా గడిపిన గడియలను మళ్లీ మళ్లీ గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. గుర్తుగా సెల్ఫీలు దిగారు. దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిన బూనారు. విద్యార్థులంతా తలపాగా, కండువా వేసుకుని అచ్చతెలుగు పెద్ద మనుషుల్లా కనిపించారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తూనే సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ , సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, బోర్డు ఆఫ్ మేనేజిమెంట్ సభ్యులు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, స్నాతకోత్సవ కన్వీనర్లు సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతులకు ఆర్థిక స్థిరత్వం కల్పిస్తున్న పీఎం కిసాన్ పథకం

**మొదటిపేజి తరువాయి**

ఏ టీ ఏ ఆర్ ఐ డైరెక్టర్ డా. షేక్ ఎన్ మీరా, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ , ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు , అంగ్రూ వైస్ ఛాన్సలర్ డా. శారద జయలక్ష్మి, ఎస్ యుయు వి వైస్ ఛాన్సలర్ డా. జె.వి. రమణ పాల్గొన్నారు. తొలుత కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.. అనంతరం జరిగిన కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. పీఎం కిసాన్ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులకు ఆర్థిక స్థిరత్వం లభిస్తుందన్నారు. వ్యవసాయం లాభదాయకంగా మారేందుకు ఇది ఒక కీలక పథకమని , ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందే దిశగా ఇది ముందడుగు అని పేర్కొన్నారు. రైతులకు నూతన పథకాలపై అవగాహన కల్పించేందుకు , కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ స్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో కృషి విజ్ఞాన కేంద్రం పాత్ర ఎంతో కీలకమైందని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ లో వరి, ప్రత్తి, వేరుశనగ, మిరప, పచ్చిశనగ వంటి పలు పంటలు పండిస్తున్నారని , ఆయా పంటల సాగుకు పెట్టుబడికి రూ. 35, వేల నుంచి రూ.50 వేల వరకు రైతులకు ఖర్చు అవుతుందన్నారు. ఆ పెట్టుబడిలో రూ. 20 వేలను రైతులకు అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ గారికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలిపారు.. పలు రాష్ట్రాల్లో కేవీకేలను రైతులు చక్కగా ఉపయోగించుకుంటున్నారన్నారు. ఆచార్య రంగ యూనివర్సిటీ చూడ చక్కగా హైటెక్ హంగులతో రూపుదిద్దుకుందని, నేడు ఉద్యానవన పంటలు, మిరప వంటి పలు పంటలు మార్కెట్ డిమాండ్ ఎక్కువగా వుందన్నారు. ఇవాళ పంట సాగుకు బయో ఫెస్టిసైడ్స్ ను ఎక్కువగా వాడుతున్నారని , అయితే కొన్ని కల్తీ కంపెనీల కారణంగా ఆ ఫెస్టిసైడ్స్ ద్వారా క్యాన్సర్ కారకాలు ఎక్కువగా పెరుగుతున్నాయన్నారు. గడిచిన సంవత్సర కాలంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో వ్యవసాయానికి అవసరమయ్యే వాటర్ మేనేజ్మెంట్ ను నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగిస్తున్నామన్నారు. ఆయా ప్రభుత్వ సంక్షేమాలను అందిపుచ్చుకుంటే పంట ఉత్పత్తి పెరిగే అవకాశం పుష్కలంగా వుంటుందన్నారు. అధికారికంగా ధ్రువీకరించిన విత్తనాలను రైతులు ఉపయోగిస్తే సాగు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ సకారంతో నేడు డ్రోన్లు ఎక్కువగా అందుబాటులోకి వచ్చాయని , ఆయా డ్రోన్ ల సహకారంతో కూడా పంట ఉత్పత్తి పెంచుకునే అవకాశం చాలా ఉందన్నారు. లేబర్ షార్టేజ్ ఎక్కువగా ఉన్న క్రమంలో సాంకేతిక విధానంతో వ్యవసాయాన్ని, ఉత్పత్తిని పొందించుకునే దిశగా రైతులు ప్రయత్నించాలన్నారు. నేను నార్త్ ఇండియాలో పర్యటిస్తున్న చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా చత్తీస్ ఘడ్ లాంటి ప్రాంతాల్లో కూడా 50 శాతం సబ్సిడీ వస్తున్న సోలార్ పంపులను రైతులు ఎక్కువగా వాడుతున్నారని , మన దగ్గర కూడా అలాంటి ప్రయత్నం జరగాలన్నారు. పండించిన పంట భద్రతకు కూడా ప్రభుత్వ పథకాల ద్వారా కూడా పుష్కలమైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎఫ్ పి ఓ ల ద్వారా కోల్డ్ స్టోరేజ్ ల నిర్మాణం చేపడితే రైతులకు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. కౌలు రైతుల ఎక్కువగా వున్న క్రమంలో కౌలు రైతులకు ఉపయోగపడేలా , సమస్యలను పరిష్కరించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో కలిసి పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి నేపథ్యంలో రైతులకు సహకరిస్తూ, ఆర్థిక భరోసాను అందిస్తున్న ప్రధాన మంత్రి మోదీ చొరవను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు సరి సమానంగా బాగున్నప్పుడే సమాజం బాగుంటుందన్నారు. రైతులు తమ వద్దకు వస్తేనే అవగాహన కల్పిస్తామనే విధంగా కాకుండా రైతుల దగ్గరికే అధికారులు వెళ్లి వారికి సాధికారతపై అవగాహన కల్పించాలి. ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ - "రైతుల శ్రమకు గౌరవం ఇచ్చే విధంగా, ప్రతి రైతు కుటుంబానికి కేంద్రం అండగా నిలుస్తోందని , పీఎం కిసాన్ పథకం రైతుకు నేరుగా మద్దతుగా వుంటుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. యుగంధర్ కుమార్ మాట్లాడుతూ "ఈ విధమైన కార్యక్రమాల ద్వారా రైతులకు శాస్త్రీయ సమాచారం , ప్రభుత్వ పథకాలపై అవగాహన పెరిగి వ్యవసాయం పటిష్టమవుతోంది" అని తెలియజేశారు. కార్యక్రమంలో రైతులకు పీఎం కిసాన్ పథకం ప్రాముఖ్యత, నగదు బదిలీ విధానం, రైతుల ఆర్థిక స్థిరతపై ప్రభావం వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించబడింది. కార్యక్రమం అనంతరం ప్రత్తిపాడునియోజకవర్గంలోని 30,354 మంది రైతులకు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పెట్టుబడి సాయం క్రింద రూ.20,14,74,000/- ల చెక్కును అందజేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర రావు , ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర , కేవీకే సిబ్బంది, రైతులు, మహిళా రైతులు, యువత , యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మొండిగేట్ వద్ద అదనపు వెంట్ వే నిర్మించండి

**మొదటిపేజి తరువాయి**

మొండిగేట్ వద్ద రైల్వే లైన్‌ను దాటుతుందని, ఇక్కడ కల్వర్ట్ కేవలం 2 మీటర్ల వెడల్పు, 2.50 మీటర్ల ఎత్తు మాత్రమే ఉందన్నారు . వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఈ కల్వర్టు సామర్థ్యం సరిపోకపోవడంతో లోతట్టు ప్రాంతాలైన క్రిస్టియన్ పేట, నందివెలుగు రోడ్డు (మసీదు సమీపంలో), వినోభా నగర్, యన్నం వారి వీధి, సోమవారి వీధి, కట్టా వారి వీధి, ఇజ్రాయెల్ పేట, నెహ్రూ నగర్, బుచ్చయ్య తోట, సంజీవయ్య నగర్, కొత్తపేట, రామిరెడ్డి తోట, ప్రకాష్ నగర్ పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని పేర్కొన్నారు. నీటి ప్రవాహంతో రైల్వే ట్రాక్ కూడా దెబ్బతింటుందని, వెంటనే ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.


**నెహ్రూ నగర్ గేట్ డబుల్ లైనుగా మార్చాలి..** శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ నేపథ్యంలో నెహ్రూనగర్ రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఎమ్మెల్యే నసీర్ వివరించారు . ఈ గేటు వద్ద కొత్తపేట వైపు రోడ్డు విస్తరణ చేపట్టామని, ఈ క్రమంలో రైల్వే గేట్ డబుల్ లైనుగా మార్చడం ద్వారా ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టులను వెంటనే చేపట్టాలని కోరారు. దీనికి డీఆర్ఎం సానుకూలంగా స్పందించారు.

# ప్రతీ రైతుకు ప్రభుత్వ సాయం : ప్రత్తిపాటి










**యడ్లపాడు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని కుల రైతు సహా ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వ సాయం అందుతుందని,ఇందులో ఎటువంటి అపోహలు, సందేహాలు లేవని రాష్ట్ర వ్యవసాయశాఖ మాజీ మంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మండలంలోని యడ్లపాడులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా భావిస్తున్న అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు చెక్కులు పంపిణీ కార్యక్రమం శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోకి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు,రైతులు ఘన స్వాగతం పలికారు. రైతు సాంప్రదాయ రీతిలో కాడేడ్లు, అరకలతో గ్రామంలో ఊరేగింపు గా సభాస్థలి కి తోడ్కొని వెళ్ళారు. అనంతరం జరిగిన సభలో ప్రత్తిపాటి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 21,614 మంది రైతులకు అన్నదాతాసుఖీభవ కింద రూ. 15.13కోట్లు అందించామని, కౌలురైతులు సహా ప్రతి రైతుకు ప్రభుత్వ సాయం తప్పక అందుతుందని తెలిపారు. జగన్ రైతుభరోసా పేరుతో రైతుల్ని దగా చేశాడని, అరకొరగా కేవలం రూ. 7,500లు మాత్రమే ఇచ్చాడని, మరోఏడాది రూ. 6,500లతోనే సరిపెట్టాడన్నారు. కూటమిప్రభుత్వం ప్రతి రైతుకు ఏటా రూ. 14వేలు ఇస్తుందని, కేంద్రసాయం రూ. 6వేలు కలిపి మొత్తం రూ. 20వేలు మూడువిడతల్లో అందిస్తుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. పెట్టుబడులు రాకుండా తప్పుడు మెయిల్స్ పెట్టేవారిని ఏంచేయాలో ప్రజలే ఆలోచించాలి. చంద్రబాబు రేయింబవళ్లు రాష్ట్రం కోసం శ్రమిస్తుంటే, పెట్టుబడులు, కంపెనీలు రాకూడదనే దురుద్దేశంతో తప్పుడు మెయిల్స్ పెట్టేవారిని ఏంచేయాలో ప్రజలే ఆలోచించుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. జగన్... వైసీపీ నేతలు తలకిందులుగా తపస్సు చేసినా.. తాననుకున్నది పూర్తిచేసేవరకు చంద్రబాబు విశ్రమించరని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. సూపర్-6 ఆఖరి పథకం అమలుతో జగన్ తట్టాబుట్టా సర్దుకొని దేశం విడిచి పోవడం ఖాయమన్నారు. మంచి ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే సమాజం కూడా జగన్ చెప్పే చెడునే నమ్ముతుందన్నారు. దుర్మార్గపు ఆలోచనలుచేసే జగన్ వంటి వ్యక్తి రాష్ట్రానికి, ప్రజలకు ఎప్పటికైనా ప్రమాదమేనని ప్రత్తిపాటి తెలిపారు.

**వైసీపీ నాయకులు ఎవరూ ప్రజలకు అండగా నిలవలేదు :**
కౌలురైతులకు ప్రభుత్వం త్వరలోనే గుర్తింపు కార్డులు అందించి, వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందించేలా చేస్తుందన్నారు. ముక్కూ ముఖం తెలియనివారిని తీసుకొచ్చి, వైసీపీ నియోజకవర్గంలో పోటీచేయిస్తోందని, వారంతా అడ్రస్ లేకుండా పోయారుతప్ప, ఎప్పుడూ ప్రజలకు అండగా నిలవలేదన్నారు. చేసిన అభివృద్ధి చెప్పకుంటూ, నిరంతరం ప్రజల మధ్య ఉండే నాయకత్వాన్ని మాత్రమే టీడీపీ ఆదరించి ప్రోత్సహిస్తోందన్నారు. మన గురించి, మన ప్రాంతం గురించి తెలియనివారిని గెలిపిస్తే, వారు స్వార్థం చూసుకుంటారు గానీ, ప్రజల గురించి పట్టించుకోరని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. టీడీపీ ప్రభుత్వాల్లో రాష్ట్రానికి మంచిపేరు ఉండేదని, జగన్ పాలనలో రాష్ట్ర పరువు, ప్రతిష్ఠలు పూర్తిగా మంటగలిశాయన్నారు.

**జగన్ తప్పుడు విధానాల వల్లే రైతులకు భూసమస్యలు :**
జగన్ తప్పుడు నిర్ణయాలు, అనాలోచిత చర్యల వల్లే రైతాంగం ఇప్పటికీ భూసర్వే సమస్యలతో అధికారుల చుట్టూ తిరుగుతోందన్నారు. రైతుల ఉసురు తగిలే జగన్ 11 స్థానాలకు పరిమితమయ్యాడన్న ప్రత్తిపాటి. వ్యవసాయం గురించి అవగాహన లేనివారు రైతులకు మేలుచేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. కూటమిప్రభుత్వం ఇచ్చే సామాజిక పింఛన్లు తీసుకునే ప్రతి ఒక్కరూ ఓటేస్తే, కూటమిపార్టీలు భారీ విజయం సాధిస్తాయన్నారు. చంద్రబాబు వంటి సమర్థుడు ఉంటేనే రాష్ట్రానికి, తమకు మేలు జరుగుతుందని వైసీపీసానుభూతిపరులు కూడా ఆలోచించుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ నెలాఖరుతో సూపర్ – 6 హామీలన్నీ చంద్రబాబు అమలుచేస్తాడని, మిగిలింది ఆడబిడ్డ నిధి ఒక్కటేనని అదికూడా త్వరలోనే అమలవుతుందన్నారు. చంద్రబాబు అందించే సంక్షేమపథకాలు చూడలేక, కడుపుమంటతో జగన్ రాష్ట్రం వదిలిపోవడం ఖాయమన్నారు. టీడీపీ నాయకత్వం చేసిన మంచిని ప్రజలకు చెప్పి, పార్టీపై, అధినాయకత్వంపై సదభిప్రాయం కలిగించాలన్నారు. నాయకుల్లో ఐక్యత లేకే గత ఎన్నికల్లో నియోజకవర్గంలో ఓడిపోయామన్న ప్రత్తిపాటి, ఇప్పటికైనా క్షేత్రస్థాయి నాయకత్వం ప్రభుత్వ పనితీరుపై మౌత్ పబ్లిసిటీ ఉధృతం చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమానంతరం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గ్రామంలోని బాలింతలకు ప్రత్తిపాటి పోషకాహార కిట్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మండల పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్, సొసైటీ చైర్మన్లు మద్దినేని సుబ్బారావు, పోపూరి రాఘవయ్య, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, వీరారెడ్డి, అంబటి సాంబాబు, పోపూరి వెంకయ్య, పోపూరి రామయ్య గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఊపిరితిత్తుల కాన్సర్‌ను ప్రధమ దశలో గుర్తిస్తే చికిత్స సులభతరం

**– డాక్టర్ ఆర్. రామకృష్ణ, ప్రముఖ పల్మనాలజిస్ట్**



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :**
స్థానిక అమరావతి రోడ్డు నందు గల హిందూ ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా సంస్థ (ఎన్ ఎస్ ఎస్) ఫార్మసీ ప్రాక్టీసు విభాగం సంయుక్తంగా ఊపిరితిత్తుల కాన్సర్ నివారణ, చికిత్సపై అవగాహనా సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం. వి. నాగభూషణం తెలిపారు. ఈ సమావేశానికి కళాశాల వైస్ చైర్మన్ మరియు ఎన్ ఆర్ ఐ మెడికల్ కళాశాల పల్మనాలజి విభాగాధిపతి డాక్టర్ ఆర్. రామకృష్ణ, ఎం.డి., డి.టి.సి.డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఒప్పిరితిత్తుల కాన్సర్ రావటానికి ధూమపానం, హుక్కా, గంజాయి, వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యం మరియు ఆధునిక జీవన శైలి, జన్యు పరమైన కారణాలన్నారు. ఊపిరితిత్తుల కాన్సర్ లోని వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్స విధానం వ్యాధి రాకుండా తీసుకోవలసకిన జాగ్రత్త లను గురించి సవివరంగా విద్యార్థులకు పవర్ పాయింట్ ద్వారా తెలియజేశారు . ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్. మధుసూదన రావు ముఖ్య అతిధికి తమ అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. ప్రత్యూష ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు కె. నాగకుమారి, ఎం. శంకర భవాని తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన పింఛన్ పంపిణీ కార్యక్రమం



**నకరికల్లు మేజర్ న్యూస్ :** నకరికల్లు మండలంలో ఎన్టీఆర్ భరోసా నూతన పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించిన అధికారులు కూటమి నాయకులు ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం అభివృద్ధి పథకంలో తీసుకెళ్తుందని ఇచ్చిన ప్రతి ఒక్క మాట నెరవేర్చే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని మండల పార్టీ అధ్యక్షులు ఏల్పుల ఆవుల రాజు అన్నారు కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు ఆకుల పెద్ద వెంకటేశ్వర్లు, తిరుమల శెట్టి సాంబయ్య, వెంకట్రావు, భవనాసి కిషోర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో అరుదైన ఆపరేషన్



**గుంటూరు, రూరల్ మేజర్ న్యూస్ :** గుంటూరు నగరం లోనేకొత్తపేట ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో అరుదైన ఆపరేషన్ జరిగింది. గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం తంగెలమూడి గ్రామం రుద్రపాటి వాణి ( 37) తండ్రి సంసోన్(60)వీరికి ముగ్గురు సంతానం. గత జూన్ ఆరవ తేదీన ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు జాయిన్ అయ్యారు. పుట్టుకతో వచ్చిన గుండె జబ్బుకు విజయవంతంగా సర్జరీ చేశారు. తల్లి గర్భంలో గుండె తయారీ సమయంలో గుండె అనేది 4 గదులుగా ఏర్పడుతుంది. దాని వలన ఆక్సిజన్ పుష్కలంగా నిండిఉన్న రక్తం శరీర భాగిలకు ఉండి వాటి పని తీరుకు ఉపయోగ పడతుంది. ఈ నేపథ్యంలో పెదకాకాని మండలం తంగేళ్లమూడికి చెందిన వాణి అనే మహిళకు నాలుగు గదులు లేకుండా ఓకే గదిగా గుండె తయారి అయ్యింది. (కంప్లీట్ ఏట్రియో వెంట్రిక్యులర్ కెనాల్ డిఫెక్ట్) ఎడమవైపు ఉన్న మంచి రక్తం కుడివైపు ఉన్న చెడు రక్తంతో కలిసి ఊపిరితిత్తులకు ఎక్కువ మోతాదులో వెళుతుంది. దానివల్ల రక్తం తక్కువ మోతాదులో శరీర భాగాలకు వెళుతుంది. ఈ కారణంగానే పేషెంట్ కు ఆయాసం, అలసట వస్తుంది. ఇలాంటి గుండెజబ్బుకి సర్జరీ చేయని పక్షంలో ఎక్కువ కాలం జీవించే అవకాశం లేదు. ఐదేళ్లలోపు సర్జరీ చేస్తే సక్సెస్ రేట్ ఎక్కువగా ఉంటుంది. డాక్టర్ యోగి చాగంటి ( హార్ట్ సర్జన్, ఆల్ ఇండియా గోల్డ్ మెడల్ ) డాక్టర్ రామరాజు, డాక్టర్ శిరీష్ ( అనస్థీషియా ),డాక్టర్ నిఖిల్ ప్రవీణ్ ( కార్డియాలజిస్ట్ ),డాక్టర్ మాధవి ( క్రిటికల్ కేర్ ),డాక్టర్ కాశిరాం ( పల్మనాలజిస్ట్ ) ఈ వైద్యుల బృందం జులై ఆరవ తేదీన విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేశారు. సర్జరీ జరిగిన ఐదవ రోజు పేషెంట్‌ను డిశ్చార్జి చేశారు. ఆదిత్య హాస్పిటల్లో ఇప్పటి వరకు 80కి పైగా గుండె ఆపరేషన్లు వందకు వంద శాతం సక్సెస్ రేటుతో విజయవంతంగా పూర్తి చేసినట్లు వైద్యులు వెల్లడించారు. ఇవే కాకుండా గతంలో కూడా పేద ప్రజలకు మరెన్నో వైద్య సదుపాయాలు కల్పించడం జరిగాయని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్స్ వివరించారు.

# 20 లోపు టిడ్కో గృహాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఇళ్లలోకి వెళ్ళాలి

**– నగర కమీషనర్ శ్రీనివాసులు**




**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**
ఈ నెల 20వ తేదీలోపు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తైనవారు కేటాయించిన గృహాలలో నివాసం ఉండాలని, లేకుంటే కేటాయింపు రద్దు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అడవితక్కెల్లపాడు, వెంగళాయపాలెంలోని 7472 టిడ్కో ప్లాట్లకు గాను 5052 ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగిందని, వాటిలో కేవలం 1565 ప్లాట్లలోని నివాసం ఉంటున్నారన్నారు. లబ్దిదారులు తమకు కేటాయించిన ప్లాట్లలో తాము నివాసం ఉండకుండా ఇతరులకు అద్దెకు ఇస్తున్నారని, అద్దెకు ఉంటున్నవారు అసాంఘీక కార్యక్రమాలు చేస్తూ చుట్టుపక్కల నివాసితులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. అటువంటి ప్లాట్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే రిజిస్ట్రేషన్ జరిగిన ప్లాట్ల లబ్దిదారులు తప్పనిసరిగా కేటాయించిన ప్లాట్లలో నివాసం ఉండాలన్నారు.

# మత్తు పదార్ధాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

**–సీఐ రామా నాయక్**




**వట్టిచెరుకూరు, మేజర్ న్యూస్ :** విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్ధాలకు దూరం గా ఉండాలని వాటికి బానిసలుగా మారితే కుటుంబాలు చిన్నభిన్నం అవుతాయని వట్టిచెరుకూరు సీఐ రామా నాయక్ అన్నారు. శనివారం సాయంత్రం మండలం పరిధిలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వాడటం వలన జీవితాలు మరియు కుటుంబాలు ఏ విధంగా పాడైపోతున్నాయో వివిధ వీడియోల ద్వారా వివరించారు. మరియు సురక్షితమైన వాతావరణంలో విద్యార్థులు చదువు కొనసాగించాలని మరింత బాధ్యతయుతమైన పౌరులుగా అభివృద్ధి చెందడానికి కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అటువంటి వాతావరణాన్ని నిర్మించడానికి ఉపాధ్యాయుల పాత్ర అవసరముందన్నారు. మాదకద్రవ్యాల వైపు విద్యార్థులు మొగ్గు చూపకుండా ఉండేందుకు వాళ్లను మానసికంగా సిద్ధం చేయడానికి ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు మరియు డ్రగ్స్ కమిటీలు పనిచేస్తాయని పేర్కొన్నారు. డ్రగ్స్ విషయంలో తోటి వారి ఒత్తిడిని నిరోధించేందుకు అవసరమైన నైపుణ్యాలతో యువతకు శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రతి ఒక్క విద్యార్థి మరొక పదిమందికి దీని గురించి వివరించే అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శ్రీ కోయ సుబ్బారావు, కార్యదర్శి శ్రీ కోయ శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి బాబు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె హరిబాబు, విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# కళ్ళంలో బిటెక్ డిగ్రీ స్నాతకోత్సవ వేడుక

**గుంటూరు మేజర్ న్యూస్ :** గుంటూరు నగర శివారు చౌడవరం కళ్ళం హరనాధరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్వయంప్రతిపత్తి హెూదాలో 2025 వ విద్యా సంవత్సరం లో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం ఇంజనీరింగ్ డిగ్రీ పట్టా లను ప్రదానం చేశారని కళాశాల డైరెక్టర్ డా. మొవ్వ ఉమాశంకర రెడ్డి తెలిపారు. ఈ ప్రదానోత్సవం కార్యక్రమానికి జె ఎన్ టి యు, కాకినాడ విశ్వ విద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ వి వి సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని 2025వ విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన 600 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాను ప్రదానం చేశారు. సభకు కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కళ్ళం మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు. కళాశాల స్థాపించిన 11 సంవత్సరాలలో ప్రముఖ విద్యా ప్రమాణాలు కలిగిన ఎన్ బి ఎ, నాక్- ఏ గ్రేడు గుర్తింపు మరియు స్వయం ప్రతపత్తిని సాధించడం తో పాటు 2025 వ విద్యా సంవత్సరంలో డిగ్రీ పట్టా ప్రదానోత్సవ స్నాతకోత్సవం జరుపు కోవడం ఎంతో సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డా. బి యస్ బి రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్నజె ఎన్ టి యు, కాకినాడ విశ్వ విద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ వి వి సుబ్బారావు మాట్లాడుతూ... కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల నుండి స్వయం ప్రతిపత్తి హెూదా పొందిన తర్వాత ఇంజనీరింగ్ డిగ్రీ పట్టా పొందిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. కళాశాల నుండి డిగ్రీ పొందడం మీ 4 సంవత్సరాల కృషికి ప్రతిపలం అని అన్నారు. విద్యార్థి గా మీ ఉన్నతి తో పాటు సమాజంలో మంచి పౌరునిగా దేశ ప్రగతికి బాటలు వేయాలని తెలిపారు. ఈ డిగ్రీ పట్టా ప్రదానోత్సవం లో 600 మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా వేషధారణ లో డిగ్రీ పట్టా ను పొందారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డా. షణ్ముఖ రావు, స్నాతకోత్సవ కార్యక్రమ కన్వీనర్ డా. సన్నీ డియోల్, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కళ్లం నవ్య, ఉపాధి కల్పన అధికారి డాక్టర్ పి యల్ మాధవ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# సమాజాన్ని కాపాడటం జర్నలిస్ట్ బాధ్యత








**తెనాలి, మేజర్ న్యూస్ :** జర్నలిస్టులతో పాటు రాజకీయ నాయకులకు కూడా పునశ్చరణ తరగతులు నిర్వహించవలసిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని శ్రీ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ సి.ఆర్, మీడియా అకాడమీ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియుడబ్ల్యూజె) తెనాలి నియోజక వర్గశాఖ సహకారంతో గుంటూరు జిల్లాలోని గ్రామీణ విలేకర్లకు రెండురోజుల పునశ్చరణ తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ అలపాటి సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆలపాటి రాజా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ శాసనసభ, కార్యనిర్వాహకం, న్యాయవ్యవస్థ, జర్నలిజం ఈ నాలుగు వ్యవస్థలు సమాజానికి నాలుగు మూల స్తంభాలని ఈ వ్యవస్థలన్నీ శరీరంలోని అవయవాల వలే కలసికట్టుగా పని చేస్తేనే సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు. జర్నలిస్టు సమాజాన్ని కాపాడటం నా బాధ్యత అని భావించి అంకిత భావంతో పనిచేయాలి. పత్రికారంగానికి సేవలు అందించిన నార్ల, సురవరం, కృష్ణారావు ఇత్యాది వారిని ఇప్పటికీ సమాజం మరచిపోలేదు. ఎవరు అధికారంలో ఉన్నారో వారికి అనుగుణంగా కొన్ని పత్రికలు పనిచేస్తున్నాయనే భావన కొందరిలో ఉంది. మౌలికమైన అంశాలకు మలినం పట్టకుండా వార్తలను అందిస్తున్న పత్రికలు కొన్ని ఇప్పటికీ ఉన్నాయి. సమాజంలోని పరిస్థితులను అవగాహన చేసుకుని, సమాజాన్ని ఏవైపు తిప్పాలో ఆవైపు మలచగలిగిన శక్తి జర్నలిస్టులకు ఉంది, ప్రావీణ్యం, సాధన అనే దిశగా జర్నలిస్టు ముందుకు సాగాలని ఆలపాటి రాజా సూచించారు. సభకు అధ్యక్షత వహించిన ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ నేడు జర్నలిజం పలుచబడటంతో సమాజంలో జర్నలిస్టుల పట్ల కొంతమేర గౌరవం తగ్గింది అని అన్నారు. జర్నలిస్ట్ల నైతిక నిష్ఠ తగ్గడం, జర్నలిజంలో నాణ్యత తగ్గడం ఇత్యాది అనేక కారణాల వల్ల జర్నలిజం వృతికి గౌరవం తగ్గడానికి కారణాలన్నారు. జర్నలిజం వృత్తిలో నాకు అన్ని తెలుసు అని జర్నలిస్టు ఎప్పుడు భావిస్తారో అప్పుడే వారి ఎదుగుదల ఆగిపోతుంది. జర్నలిస్ట్ నిత్యవిద్యార్థిగా ఉండాలి. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకుసాగాలి. ప్రజా ప్రయోజనం అనే గీటురాయి మీద నిలబడేదే వార్త. జర్నలిస్టు ప్రజాస్వామ్య పరిపుష్టకి పనిచేయని ఎడల సమాజం నష్టపోతుంది. మనది గ్రామీణ భారతం కాబట్టి గ్రామీణ జర్నలిస్టకు తగిన శిక్షణనివ్వవలసిన అవశ్యకత ఉంది. ఆ కారణంగా ప్రతి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ తరఫున జర్నలిస్టకు పునశ్చరణ తరగతులను నిర్వహించనున్నామని సురేష్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఏపియుడబ్ల్యూజె అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎన్. మీరా, విజికె అండ్ వివిఎల్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్స్ సియండి మునగాల మోహన శ్యాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ, నల్లి ధర్మారావు తదితరులు ప్రసంగించారు. ఏపియుడబ్ల్యూజె తెనాలి అధ్యక్షుడు చందు. సుబ్బారావు సభను నిర్వహించగా కార్యదర్శి ఎం. గోపీచంద్, మార్కాండేయులు, రాంబాబు, దీపాల తారక సాయినాథ్, బి.మురళీ, సుధాకర్, శరత్ పర్యవేక్షించారు.

**మొదటి శిక్షణా తరగతి...**

సభానంతరం జరిగిన మొదటి శిక్షణా తరగతిలో సీనియర్ జర్నలిస్ట్ ఎస్. గుర్నాథ్ 'సోషల్ మీడియా యుగంలో మీడియా పాత్ర' అనే అంశంపై ప్రసంగించారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్న జరిగిన శిక్షణా తరగతుల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగ మాజీ శాఖాధిపతి డాక్టర్ జి. అనిత 'జర్నలిజంలో నైతిక నిష్ఠ' అనే అంశంపై ప్రసంగించగా, ప్రజాశక్తి దినపత్రిక సంపాదకుడు తులసీదాస్ మీడియాలో నూతన ధోరణులు' అనే అంశంపై ప్రసంగించారు. రెండవరోజు ఆదివారం సాయంత్రం పునశ్చరణ తరగతుల ముగింపు సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# ఎవర్ని పరామర్శించకూడదని రెడ్ బుక్ రాజ్యాంగంలో రాశారా

**– దేవినేని అవినాష్**

**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** రూరల్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 73/2025 విచారణ నిమిత్తం కృష్ణాజిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు దేవినేని అవినాష్, సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి శనివారం హాజరయ్యారు. విచారణ అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్ చాలాసార్లు పర్యటన చేశారు. ఏ రోజు మా ప్రభుత్వం అడ్డుకోలేదు...అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం వైసిపి కార్యకర్తను వేధింపులకు గురి చేస్తే నాగమల్లేశ్వరరావు చనిపోతే పరామర్శలకు వచ్చిన నాయకులపై కేసులో నమోదు చేశారు. ఎవర్ని పరామర్శించకూడదని రెడ్ బుక్ రాజ్యాంగంలో ఏమైనా సపరేట్గా రాశారా అని దేవినేని అవినాష్ ప్రశ్నించారు. జిల్లాల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటన చేసినా కూడా ఆంక్షలు పెట్టి అడ్డుకుంటున్నారు...రాష్ట్రంలో, దేశంలో మాస్ ఇమేజ్ గల వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం సంవత్సరకాల పరిపాలన చూసి ప్రజలు, మరలా మాజీ ముఖ్యమంత్రి జగన్ కావాలని అనుకుంటున్నారన్నారు. వైసిపి కార్యకర్తలను, నాయకులను ఇబ్బంది పెట్టిన వారికి వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తో అవినాష్ అన్న వస్తే... ఆయన జన సమీకరణ ఎందుకు చేశారని... డిజేలు పెట్టారని... జండా కర్రలు పంచారని... కేసు పెట్టారు. ఆయనకి ఏమి సంబంధం ఉంటుంది. కేవలం కూటమి ప్రభుత్వం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని వారిని ఏదో ఒక విధంగా ఇబ్బందులు పెట్టే ఆలోచనతో ఎన్నో కేసులు పెడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై సంవత్సరం కాలంలో ఎంతో వ్యతిరేకతతో ప్రజలు రాష్ట్రమంతా సత్తెనపల్లి వైపు చూసేలా చేశారన్నారు. ఇలా ఎన్నికేసులు పెట్టినా భయపడి వెనక్కితగ్గే ప్రసక్తే లేదని, ప్రతి ఒక్కకార్యకర్త పడుతున్న ఇబ్బందులు పరిస్థితిని గుర్తుపెట్టుకొని అందరికీ అండగా ఉంటానని తెలియజేశారు.



# వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదు



**పెదనందిపాడు : మేజర్ న్యూస్ :** ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి వాటిని ప్రభుత్వం చూపించిన ప్రదేశాలలో, గ్రామానికి దూరం ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్డుల్లో వేయాలని ఎంపీడీఓ లక్ష్మి దేవి అన్నారు. శనివారం ఉదయం మండల కేంద్రం పెదనందిపాడు లో ఎంపీడీఓ లక్ష్మి దేవి పారిశుధ్య కార్మికులకు అహగాహన కల్పించారు. పెదనందిపాడు ప్రధాన రహదారి వెంబడి పారిశుధ్య కార్మికుల చెత్త సేకరించే విధానాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. వ్యర్థాలను రోడ్డు పక్కన వేయరాదని ఆలా వేస్తె కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నూతన పెన్షన్లతో భరోసా పేదల జీవితాల్లో నూతన వెలుగులు



**పెదకాకాని మేజర్ న్యూస్ :** పెదకాకాని మండలంలో ఇటీవల మంజూరైన వితంతు నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇన్స్టాల్ మెంట్లు మాదిరిగా ఇస్తే చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వితంతువులకు 4వేల రూపాయలకు పెంచి ఎవరిపై ఆధారపడకుండా ప్రభుత్వ పరంగా అండగా నిలబడుతున్నారని కాయలు ఉన్న చెట్టుకి రాళ్ళు వేసినట్లు ప్రజలు కోసం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై మరియు నాయకులపై విమర్శలు చేస్తున్నారని ప్రజలు గమనించాలని కోరారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల సమస్యలు పరిష్కారం చేయడంలో గానీ మేలు చేయడంలో గానీ రాజీ పడేది లేదని స్పష్టం చేశారు తదనంతరం వితంతువులకు నూతన పెన్షన్లు పంపిణీ చేశారు ఇంకా నుంచి గడప వద్దకే పెన్షన్లు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొర్రపాటి సురేష్,మోసిన్,లింగంగుంట సాల్మన్ రాజు, దర్శి భాస్కరరావు, పూర్ణ ,ఆత్మకూరి వెంకటేశ్వర్లు, బొల్లెద్దు సుశీలరావు,కుక్కల మల్లిఖార్జునరావు, బోయపాటి రామ్మోహన్, చిట్టిబాబు,కనకరాజు,కోలాటపు మాణిక్యరావు, ఆత్మకూరి ఆదినారాయణ, తాళ్ళ శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, రుక్మిణీ, లింగంగుంట అశోక్, సిలార్, లాజర్, బాజి మండల పరిషత్ ఎంపీడీవో, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# నైస్ కోచింగ్ అభ్యర్థులు విజయభేరి

**గుంటూరు, రూరల్ మేజర్ న్యూస్ :**

హెూం మంత్రి వి. అనిత ప్రకటించిన ఆంధ్ర రాష్ట్ర పోలీస్ కానిస్టేబుల్ తుది జాబితాలో నైస్ కోచింగ్ సెంటర్ అభ్యర్థులు ఉద్యోగాలు సాధించినట్లు డైరెక్టర్ పులిపాటి నగేష్ తెలిపారు. ఈ ఫలితాలలో వి.వెంకటేష్ రాష్ట్రస్థాయిలో 144 మార్కులు, కె.యువరాజ్ 136 మార్కులు,ఎస్ కె.నాగుల్ మీరా 135,శివ నాగేశ్వరరావు 129 మార్కులు,సి. హెచ్. గోపి 108 మార్కులు, ఎం నాగరాజు 122 మార్కులు వచ్చాయన్నారు.డి.దినేష్ , ఆర్.చిన్న, డి.కళ్యాణ్,డి. మనోహర్,కొండల్ రెడ్డి,ఏపీ ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించినట్లు డైరెక్టర్ పి.నగేష్ చెప్పారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అధ్యాపక బృందం బయాలజీ రాజు, హిస్టరీ సతీష్,జివిఆర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ తురక వీరయ్య విద్యార్థి తదితరులు అభినందించారు.



# రైతుల ఖాతాల్లో రూ.14.30 కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** రైతులు బాగుంటేనే అన్ని వర్గాల ప్రజలు బాగుంటారని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శనివారం నరసరావుపేట మండలం ఇస్సాపాలెం గ్రామంలో అన్నదాత సుఖీభవ మరియు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ముందుగా రైతులకు నరసరావుపేట నియోజకవర్గంలో విడుదలైన రూ. 14.30కోట్ల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోరుకునే ప్రభుత్వం అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో డిబిటి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో నగదు జమ చేయబడిందన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ మరియు పీఎం కిసాన్ పథకాల కింద మొత్తం రూ. 14.30 కోట్ల నిధులను విడుదల చేసినట్లు ప్రకటించారు. ఈ నిధులను చెక్కుల రూపంలో అర్హులైన రైతులకు అందజేశారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న ఈ పథకాల ద్వారా ఒక్కో రైతుకు రూ. 7,000 నగదు జమ చేయబడినట్లు ఆయన తెలిపారు. ఈ మొత్తంలో పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ. 2,000 మరియు అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 5,000 అందిస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిన్న, సన్నకారు మరియు కౌలు రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రవేశపెట్టిన ఒక ప్రధాన సంక్షేమ కార్యక్రమంఅని అన్నారు. ఈ పథకం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనతో అనుసంధానం చేయబడి, రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడం ద్వారా వారి జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ నిధులు రైతులు ఖరీఫ్, రబీ పంటల సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పంటల సంరక్షణ ఖర్చులు మొదలైన వాటికి ఉపయోగపడతాయని తెలిపారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. “రైతులు దేశానికి వెన్నెముక. వారి ఆర్థిక భరోసా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. పీఎం కిసాన్ పథకంతో కలిపి ఈ నిధులు రైతులకు పెట్టుబడి సాయంగా ఉపయోగపడతాయి,” అని ఆయన అన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో ఈ పథకం కింద 20,425 మంది రైతులు లబ్ధి పొందినట్లు తెలిపారు. ఈ రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 7,000 చొప్పున జమ చేయబడినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మొత్తం రూ. 20,000 ను మూడు విడతలుగా సంవత్సరానికి రైతులకు అందజేయడం జరుగుతుందని, ఈ మొత్తంలో పీఎం కిసాన్ ద్వారా రూ. 6,000 మరియు అన్నదాత సుఖీభవ ద్వారా రూ. 14,000 రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# పెద్ద తురకపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** నరసరావుపేట శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు శనివారం నరసరావుపేట మండలంలోని పెద్ద తురక పాలెం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి కోసం ఎన్ఆర్ ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేస్తున్నామని, ఈ సీసీ రోడ్డు నిర్మాణంతో పెద్ద తురక పాలెం గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా స్థానికుల జీవన ప్రమాణాలు పెరుగు తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని, గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు రవాణా సౌలభ్యంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ నాయకులు, గ్రామస్థులు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు కూడా పాల్గొన్నారు.

# హెచ్ఐవి పరీక్ష తప్పనిసరి




**గుంటూరు, రూరల్ మేజర్ న్యూస్ :** మన భారతదేశంలో పెళ్లికి ముందు హెచ్ఐవి పరీక్ష తప్పనిసరి చేయాలని ఒక చట్టం తీసుకొని రావాలి, దీనిని మీ ద్వారా మన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కితెలియజేయడం జరిగిందని డాక్టర్ వైషేక్ నేషనల్ లేబర్ గ్యాస్రో హాస్పిటల్ చైర్మన్ శనివారం నాడు ఆర్ అగ్రహారం నరసింహ స్వామి గుడి దగ్గర గల వారి నేషనల్ లివర్ గ్యాస్ట్రోహాస్పిటల్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్. వైస్ షేక్ మీడియాతో మాట్లాడుతూ మేఘాలయ ప్రభుత్వం హెచ్ఐవి టెస్టులు పెళ్ళికి ముందు తప్పనిసరి చేయించు కోవాలని చట్టం జారీ చేయాలన్న యోచనలో ఉంది. గోవా ప్రభుత్వం పెళ్ళికి ముందు హెచ్ఐవి టెస్టులు అనేది తప్పనిసరిగా చేయించుకోవాలని చట్టం చేసింది, దేశంలో అందరికంటే ముందు ఈ చట్టం చేయాలని నేను ఉద్యమం మొదలు పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. దీనితో ఈ చట్టం కోసం నేను 2005 నుంచి చేసిన ఉద్యమానికి మన దేశం లో వచ్చిన కదలికకు నేను చాలా గర్వపడుతున్నానని అన్నారు , స్వాగతిస్తున్నాను. దేశ ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వాలు నా ఉద్యమానికి బాసట ఇస్తున్నారు. చేసిన ఉద్యమం ఊపందుకుందిఅని తెలిపారు. 2005 నుంచి పెళ్లికి ముందు హెచ్ఐవి టెస్టులు తప్పనిసరి అని వారి స్వంత ఖర్చులతో అనేక చర్చా గోష్టులు, అన్నివర్గాల వారితో సభలు సమావేశాలు ఏర్పాటు చేశాను, అన్ని వర్గాల మేధావులతోను, మత పెద్దలతోను, మంత్రులతోను, MLAలతోను, రాజకీయ నాయకులతోను ఎంపీలతోను చర్చించారు. అదేవిధంగా టిడిపి అధ్యక్షులు ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ని, కలిసి దీని గురించి చెప్పి వాళ్లంతా దీనికి సానుకూలంగా స్పందించేటట్టు తెలిపారు. అందరితోనూ చర్చించి ఒప్పించి, 2007 వ సంవత్సరంలో దీని గురించి 2008వ సంవత్సరంలో ఫిబ్రవరి 20 నుంచి 27 వరకు నేను ఇందిరా పార్క్ హైదరాబాద్‌లో నిరాహార దీక్ష కూడా చేసాను, మన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ని కూడా కలిసే ఒప్పించడం జరిగిందని అన్నారు దానికి ఆయన సానుకూలంగా స్పందించి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి చట్టం చేద్దాం అని మాట ఇచ్చారు. అప్పటి ట్రాన్స్‌పోర్ట్ మినిస్టర్ కన్నా లక్ష్మీనారాయణ ని నా నిరాహారదీక్ష శిబిరానికి పంపించి నిమ్మరసం ఇచ్చి నిరాహార దీక్షను విరమింపచేశారు. కానీ దురదృష్టవశాత్తు వై. యస్ రాజశేఖర్ రెడ్డి మరణించడం జరిగింది, అయినా ఇప్పటివరకు కూడా నా ప్రయత్నం ఇలాగే కొనసాగిస్తున్నాను, మరి ఈరోజు మేఘాలయ ప్రభుత్వం గోవా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మళ్ళీ నాకు ఈ చట్టం పై ఆశలు చిగురించాయి. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా దీనిని చట్టం గా ప్రకటించాలని కోరుకుంటున్నాను, అలాగే మనదేశంలోని అన్ని రాష్ట్రాలు కూడా పెళ్లికి ముందు హెచ్ఐవి టెస్టులు తప్పనిసరిగా చేపించుకోవాలి అనే దాని మీద చట్టం జారీ చేయాలని మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మనస్ఫూర్తిగా తెలియజేయడం జరుగుతుందని అన్నారు, ఎందుకంటే ఈ చట్టం చేయడం వల్ల వేలాది కుటుంబాలు రక్షింపబడతాయి, ఇది వ్యక్తి గత ఆరోగ్య సమస్యే కాదు. సమాజ భద్రతకు సంబంధించింది అన్నారు.

# అన్నదాత సుఖీభవ సీఎం

**– కిసాన్ పథకమును తొలి విడతగా దుగ్గిరాల**
**– యార్డ్‌లో ఘనంగా ప్రారంభోత్సవం**

**దుగ్గిరాల ,మేజర్ న్యూస్ :** దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డ్ లో శనివారం అన్నదాత సుఖీభవ సీఎం కిసాన్ పథకం ను తొలివిడతగా నియోజకవర్గ పరిధిలో ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరు కాగా మండల వ్యవసాయ అధికారి ఆర్. విజయబాబు అధ్యక్షత వహించారు. అనంతరం చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు తమ్మిశెట్టి జానకి దేవి, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ,నియోజకవర్గం పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, యార్డ్ చైర్మన్ ఝాన్సీ రాణి, వైస్ చైర్మన్ రవి కిషోర్, ఎంపీపీ షేక్ జబీన్, మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత, మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ తోటకూర శ్రీనివాసరావు ,రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ తోట పార్థసారథి, ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు ,తాసిల్దార్ సునీత, నియోజకవర్గం మండల అధికారులు పి. శిరీష,జెడ్. శైలజ ,కేశంనేని శ్రీ అనిత, గూడూరు వెంకటరావు, వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ , వాసిరెడ్డి శ్రీనివాసరావు, అంచే మారుతి వరప్రసాద్, చుండూరు ఉమామహేశ్వరరావు , పాటిబండ్ల కృష్ణప్రసాద్ ,తాళ్ల అశోక్, గద్దె వాసు, యార్డ్ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.








# ఘనంగా అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభం

**– సామాజీక స్మగ్లర్లు పిన్నెల్లి సోదర్లు**
**– మా రపా.. రపా.. దాటికి తట్టుకోలేరు**
**– జగన్ రెడ్డికి బ్రహ్మారెడ్డి మాస్ వార్నింగ్**
**– వరికపూడిశెల పూర్తి చేస్తాం**
**– అన్నదాత సుఖీభవ అమలు చేశాం**
**– రైతుల హర్షాతిరేకాలతో మురిసిన ముటుకూరు**

**దుర్గి మండలం :** రెండు దశాబ్దాలుగా పిన్నెల్లి సోదర్లు దోపిడి దొంగలు మాదిరిగా మాచర్ల నియోజకవర్గంపై పడి అన్నీ వర్గాల వారిని దోచుకున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. మరోవైపు గతంలో దశాబ్దాలుగా ఫ్యాక్షన్, నక్సలిజం నియోజకవర్గంలో రాజ్యమేలడంతో ఈ ప్రాంతం మరింత వెనకబడిందని వాపోయ్యారు. శనివారం మండల కేంద్రంలోని ముటుకూరు గ్రామంలో కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ యోజన్ పథకాల అమలు కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ముందుగా కార్యక్రమం జరిగే ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రకృతి వ్యవసాయం స్టాల్స్ ను సందర్శించారు. ప్రకృతి సిద్ధంగా వివిధ రకాల పండ్లు, కూరగాయాలను పండించేందుకు తీసుకుంటున్న యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబుల ప్రసంగాలను ఎల్ఈడీ స్క్రీన్ పై ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి పెద్ద పీఠ వేసేలా కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని చెప్పారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా అన్నదాత సుఖీభవ నగదును రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఏక కాలంలో 38 వేల 885 మంది రైతుల ఖాతాల్లో రూ. 27.18 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని ఆయన పేర్కొన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో రైతుల మోముల్లో సంతోషాలు వెల్లివిరుస్తుంటే.. గత వైసీపీ పాలనలో జరిగిన దగా కోరు చర్యలు వలన రైతు నిండా మునిగారని స్పష్టం చేశారు. పరదాల మాటునా జగన్ అడ్డగోలు విధానాలతో రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ సర్వనాశనం అయ్యాయని ఆయన వివరించారు.

**మా రపా.. రపా.. దాటికి తట్టుకోలేరు..**

సంఘ విద్రోహ శక్తులకు కొమ్ము కాస్తూ.., వారిని కాపాడేందుకు జగన్ రెడ్డి ఓదార్పు యాత్రల్లో రపా రపా అని రెచ్చగొట్టే పదజాలంతో చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపనీయమని ఎమ్మెల్యే జూలకంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. మా రపా రపా దాటికి మీ ముష్కర మూకలు తట్టుకోలేవని మాస్ వార్నింగ్ ఇచ్చారు. అభివృద్ధి విఘాతం కలిగించే చర్యలు వలన నష్టపోతామని అధినేత చంద్రబాబు మాటకు కట్టబడి సమయమనం పాటిస్తున్నమన్నారు. త్వరలో జగన్ కు 7.0 పేరుతో ఊచలు లెక్కపెట్టడం ఖాయమని ఎద్దేవా చేశారు. స్కీముల పేరుతో చేసిన స్కాంలు ఇప్పుడు జగన్ మెడకు చుట్టుకుంటున్నాయని.., ఇప్పటికే అనుచర గణం జైలు ఊచలు లెక్కపెడుతున్నారని విమర్శించారు. అంతేకాక ఎదురు దాడులతో సమాజంలో మార్పును చూడలేం అని.., సమయమనం పాటిస్తుంటే..



రాక్షస వైసీపీ మూకలు రాష్ట్రంలో రెచ్చిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వరికపూడిశెలను పూర్తి చేస్తాం ..**

వరికపూడి శెల ప్రాజెక్టును పూర్తి చేసి.., పల్నాడు ప్రజలకు అంకితం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాయని ఎమ్మెల్యే జూలకంటి ఉద్ఘాటించారు. ఇప్పటికే ఫారెస్ట్ క్లియరెన్స్ కు అవసరమైన నిధులు విడదల చేసి.., పనుల ప్రారంభోత్సవానికి ఉన్న అడ్డంకులను తొలగించామన్నారు. ఫేజ్ –1, ఫేజ్ –2 పనులను పూర్తి చేసి.., పల్నాడు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. రూ. 1200 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులకు త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదిగా శంకుస్థాపన జరుగుతోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వసతి గృహాలలో మౌలిక వసతులను మెరుగుపరచండి

– మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఈరోజు కలెక్టర్ ని కలిసి ప్రభుత్వ వసతి గృహాల లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల మరియు పల్నాడు జిల్లాలో గంజాయి విక్రయాల గురించి తక్షణమే చర్యలు తీసుకోమని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఈ మీడియాతో మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని అనేక ప్రభుత్వ వసతి గృహాలలో కనీస వసతులు కరువయ్యాయని వసతి గృహాల నిర్వహణ దారుణంగా ఉందని విద్యార్థులకు కనీస వసతులైన తాగునీరు లైట్లు మరియు ఫ్యాన్లను తక్షణమే ఏర్పాటు చేయాలని వసతి గృహములు శుభ్ర పరిచేందుకు స్వీపర్లను అపాయింట్ చేయాలని కొన్ని వసతి గృహములలో విద్యార్థులకు పురుగులు పట్టిన అన్నం కుళ్ళిన కూరగాయలతో ఆహార పదార్థాలు వండుతున్నారని తక్షణమే నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని కలెక్టర్ కూడా తక్షణమే స్పందించి దీనిపై ఒక రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ వసతి గృహాల లో మౌలిక వసతులను మెరుగుపరిచే కార్యక్రమం చేస్తామని చెప్పడం జరిగింది.

# అబద్ధపు హామీలతో గెలిచిన బాబు



**పెదనందిపాడు, మేజర్ న్యూస్ :** ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ అబద్దపు హామీలు ఇచ్చి ప్రజల ఓట్లు గెలిచిన బాబు పర్యటనల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వైసీపీ మండల కన్వీనర్ షేక్ ఖాసీం పీరా అన్నారు. శనివారం సాయంత్రం పెదనందిపాడు, నాగులపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న ఖాసీం పీరా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రతిపక్షం నాయకులు అడుగుతుంటే, ప్రజలను తప్పు దోవ పట్టించటానికి ప్రశ్నించే నాయకులను అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతు, పాలన గురించి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు అధికారం లోకి వస్తే రైతులుకు కూడా అన్యాయమే జరుగుతుందని చెప్పారు. ఇంటింటికి తిరుగుతూ బాబు మోసాల గురుంచి తెలిపారు. ఈ కార్యక్రమం లో దాసరి పద్మారావు, ఎమ్ విజయ్, చెల్లి శ్రీను, గిట్టిముక్కల వెంకట సుబ్బారావు, బండి కిషోర్, దివ్వి రాంబాబు, దివ్వి నాగయ్య,జెట్టి శ్రీనివాసరావు, రవి, కె సునీల్, కె సాంబశివరావు, జె సంజీవ రావు, టి శ్రీకాంత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్ అశోక్ కుమార్



**మాచవరం , మేజర్ న్యూస్ :** మాచవరం మండలం కొత్త పిన్నెల్లిగ్రామంలో వేంచేసి ఉన్న అంకమ్మ తల్లి అమ్మవారిని రాష్ట్ర వైసీపీ వైద్య విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు అనంతరం డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ అంకమ్మ తల్లి దయవల్ల ఈ రాష్ట్రం ఈ పల్నాడు ప్రాంతం సకాలంలో వర్షాలు పడి రైతులకు పంటలు బాగా పండి అందరు ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా ఉండాలని అమ్మవారిని కోరుకుందాం అన్నారు . ముడేల వారి నిర్వహించిన విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురలీధర్ రెడ్డి పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ జెండా రూపకర్త పింగళికి ఘన నివాళి



**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** స్వాతంత్ర సమరయోధుడు జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా జడ్పీ హైస్కూల్లో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు రమణ మాట్లాడుతూ మహాత్మా గాంధీతో సన్నిహితంగా జాతీయ మువ్వన్నెల జెండాను ఏర్పాటుచేసి ఎంతో దేశభక్తిని చాటుకున్న వ్యక్తి పింగళి వెంకయ్య అని అన్నారు. 2000 సంవత్సరంలో ఆయన పేరు మీద పోస్టల్ డిపార్ట్మెంట్ స్టాంపులను విడుదల చేసింది అన్నారు.అలాంటి మహనీయులను జ్ఞాపకం చేసుకోవడం ఆనందదాయకంగా ఉందన్నారు.

# ఓటర్ల సంక్షిప్త సవరణ అధికారులుతో సమీక్ష సమావేశం





**నరసరావుపేట మేజర్ న్యూస్ :**
పల్నాడు జిల్లాలోని పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు మార్పులు చేర్పులపై జిల్లాలోని కలెక్టరేట్ లో పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు,జిల్లా రెవెన్యూ అధికారి ఏక. మురళి సమీక్ష నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లాకు చెందిన ఆర్డీవోలు, ఏడు నియోజక వర్గాల ఎలక్ట్రోలర్స్ రిజిస్ట్రేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులు,తహశీల్దార్లు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజర య్యారు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత నియోజక వర్గాలలో సంబంధిత ఎలక్ట్రికల్ రిజిస్ట్రేషన్, సహాయ ఎలక్ట్రికల్ రిజిస్ట్రేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులు అంతా కలిసి రాజకీయ పార్టీల ప్రతి నిధుల నుంచి స్వీకరించడం జరిగింది.పల్నాడు జిల్లాలో గతంలో 1932 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈసీఐ రాష్ట్ర ఎన్నికల సంఘంఆదేశాల ప్రకారం ఒక్కో పోలింగ్ బూత్ కు 1200 ఓటర్లు దాకా పోలింగ్ కేంద్రాలుగా విభజన చేసి కొత్తగా 184 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం వాటి సంఖ్య 2115 పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. ఆర్. ఓ ఏకా మురళి, ఆర్డీవోలు మధులత, రమా కాంత రెడ్డి, మురళీ కృష్ణ, ఏడు నియోజక వర్గాల ఎలక్ట్రోల్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్ట్రోల్ అధికారులు, తహశీల్దార్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేట ఇంఛార్జి డీఎస్పీగా వెంకటరమణ



**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :** నరసరావుపేట ఇంఛార్జి డీఎస్పీగా ఎం .వెంకటరమణను నియమించారు. ఇప్పటి వరకు నరసరావుపేట డీఎస్పీగా పనిచేసిన కె. నాగేశ్వరరావు గురువారం ఉద్యోగ విరమణ పొందిన విషయం విదితమే. ఆయన స్థానంలో ప్రభుత్వం ఎవ్వరినీ నియమించలేదు. దీంతో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.వెంకట రమణను ఇంఛార్జి డీఎస్పీగా నియమిస్తూ శుక్రవారం పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

# తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివి : సిడిపిఓ విజయ గౌరీ



**తెనాలి, మేజర్ న్యూస్ :** తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివి అని స్త్రీ , శిశు సంక్షేమశాఖా ప్రాజెక్ట్ అధికారి పి. విజయాగౌరి తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ టి సౌభాగ్య వాణితో కలిసి వైద్యశాలలోని గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యతను వివరించారు. ఈ సందర్భంగా సిడిపిఓ విజయా గౌరీ మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యతను తెలియజేసేందుకు ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాల వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి బిడ్డకు మధ్య అనుబంధం పెరుగుతుందని దానితోపాటు రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులు నివారించవచ్చని తెలిపారు. స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ అంగనవాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిపాల విశిష్టతపై అందరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ నాగమణి, అంగన్వాడి కార్యకర్తలు వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# గడపగడపకు బాబు షూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నడా.గజ్జల



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** పట్టణంలోని 8వ వార్డు నందు గడప గడపకు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో సత్తనపల్లి వైఎస్ఆర్సిపి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజల్లోకి బాబు చేసిన మోసాలు తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ప్రజల్లో తెలుగుదేశం పార్టీపై నమ్మకం సన్నగిల్లిందన్నారు. చంద్రబాబు పాలనా చూసిన తర్వాత వైసీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

– పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు

**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :**
జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పట్టాభిపురం లో ని మహాలక్ష్మమ్మ పుల్లయ్య స్కూలులో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం పట్టాభిపురం సిఐ గంగా వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడటం వలన విద్యార్థుల భవిష్యత్తు శూన్యం అవుతుందని ప్రతి ఒక్కరూ అటువంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి పెంపొందించుకొని తల్లిదండ్రుల పిల్లల మీద పెట్టుకున్న లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థినీ,విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.















# విజ్ఞాన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం దృశ్యమాలిక

చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ గౌరవ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ , విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఘన స్వాగతం స్వీకరించిన గవర్నర్.

– గుంటూరు జిల్లా నేటి దినపత్రిక, సూర్య బ్యూరో



## ప్రజా నాయకులకు పదవులు అలంకారం


### ఎమ్మెల్యే నసీర్ ద్వారానే మైనారిటీల సంక్షేమం

**గుంటూరు, మేజర్ న్యూస్:** ప్రజాసేవక పునరంకితమైతే పదవులు వెతుక్కుంటూ వస్తాయని చెప్పడానికి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అంజుమ్ -ఏ-ఇస్లామియా కమిటీ అధ్యక్షులు నసీర్ నిదర్శనమని అని పలువురు పేర్కొన్నారు .ఎమ్మెల్యే నసీర్ అసెంబ్లీ కమిటీ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా శనివారం స్థానిక అంజుమన్-ఏ- ఇస్లామియా పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంజుమన్ -ఏ- ఇస్లామియా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ అంజుమన్ పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు ఒక గొప్ప చరిత్ర అని పేర్కొన్నారు. కేవలం మధ్యాహ్న భోజనమేకాకుండా విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడంతోపాటు మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల పట్ల అంకితభావం కలిగిన నాయకులకు పదవులు వన్నెతెస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నసీర్ ద్వారానే మైనారిటీల అభివృద్ధి సంక్షేమం సాధ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో సైదా, జహిద్, రఫీ, షౌకత్, బషీ, మాకబూల్, షరీఫ్, డాక్టర్ అన్వార్, మౌలానా రెహమాన్ తదితరులు పాల్గొన్నారు

## చంద్రబాబు అడిగారు... వేదికపైనే గడ్కరీ ప్రకటించారు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** రాష్ట్ర పర్యటనలో భారీ ప్రాజెక్టులను మంజూరు చేస్తూ ప్రకటన చేసిన కేంద్ర మంత్రి గడ్కరీ శనివారం ప్రకరణ చేశారు హైదరాబాద్ - విజయవాడ రోడ్డు 6 లేన్లు చేస్తారు. రూ.6700 కోట్లు ఖర్చు అవుతుంది. విజయవాడ - మచిలీపట్నం రోడ్డు 6 లేన్లు చేస్తారు. ఇందుకుగాను రూ.2600 కోట్లు ఖర్చు అవుతుందని ప్రకటించారు. వినుకొండ- గుంటూరు రోడ్డు 4 లేన్లు చేస్తారు. దీనికిరూ.2605 కోట్లు కేటాయిస్తారు.

- గుంటూరు -నిజాంపట్నం రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.2000 కోట్లు. అవుతుంది.
- బుగ్గకయిప - గిద్దలూరు రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.4,200 కోట్లు అంచనా వేశారు.
- ఆకివీడు- దిగమర్రు రోడ్డు 4 లేన్లు చేస్తారు. రూ.2500 కోట్లు
- పెడన - లక్ష్మీపురం రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.4,200 కోట్లు
- ముద్దనూరు -కడప రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.1182 కోట్లు
- ఇవి కాకుండా హైదరాబాద్ -విజయవాడ గ్రీన్ ఫీల్డ్



హైవే కూడా మంజూరు చేశారు.

ఏడాదిలో మరో లక్ష కోట్ల రూపాయాల హైవే ప్రాజెక్టుల మంజూరుకు వేదిక నుంచే గడ్కరీ అంగీకారం తెలిపారు. దీనిపై సంతోషాన్ని వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు...గడ్కరీకి ధన్యవాదాలు తెలిపారు. ఉదయం అన్నదాత సుఖీభవతో సంక్షేమ కార్యక్రమం...సాయంత్రం సంపద సృష్టించే అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వామి అవ్వడం మరిచిపోలేని అనుభవం అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మన్నవ

**గుంటూరు, మేజర్ న్యూస్ :** శనివారంమంగళగిరి సి కె కన్వెన్షన్ లో కేంద్రమంత్రి శ్రీ నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ఆంధ్రప్రదేశ్ లో రూ. 5,233 కోట్ల రూపాయల జాతీయ రహదారుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు




జనం కోసమే

నేటి దినపత్రిక సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత
శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని
ముఖులిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా
మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియజేయాలని
ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియజేస్తున్నాం..

టి.బాలు
బ్రాంచ్ మేనేజర్,
సెల్: 9440747307

ఎన్.లక్ష్మీనారాయణ
రీజనల్ మేనేజర్
సెల్: 6301107116

విలేఖరులు కావలెను..

| | |
|---|---|
| వినుకొండ | : శావల్యాపురం, నూజెండ్ల |
| నరసరావుపేట | : రొంపిచర్ల, నరసరావుపేట రూరల్ |
| పెదకూరపాడు | : బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, అమరావతి |
| సత్తెనపల్లి | : నకరికల్లు |
| తెనాలి | : తెనాలి రూరల్, కొల్లిపర |
| ప్రత్తిపాడు | : పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు |
| మంగళగిరి | : తాడేపల్లి, మంగళగిరి |